సకల సమాచారం..
కియోస్క్ సొంతం

- రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న కియోస్క్
- రైతుల సమాచారం కోసం ప్రత్యేక యాప్
- ఎరువులు, పురుగు మందులు బుక్ చేసుకునే వెసులుబాటు
- తొమ్మిది రకాల సేవలు అందిస్తున్న కియోస్క్


నడికుడి రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ యంత్రం

దాచేపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సంక్షేమం కోసం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలు న భూతో న భవిష్యతి. అన్నదాతల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసే పంటల నుంచి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు అండగా నిలిచింది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు రైతుల పాలిట కల్పతరువుగా ఉన్నాయనటంలో సందేహం లేదు. భూసార పరీక్షల నుంచి పంట దిగుబడి విక్రయించే వరకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చింది. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందేందుకు రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు వెన్నుదన్నుగా నిలిచాయి. ఆర్బీకేల పరిధిలో ముఖ్య పంటలకు కనీస మద్దతు ధరను తెలుసుకోవచ్చు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, వాణిజ్య పంటలు రైతులు నష్టపోకుండా అనుకూలమైన ధరకు అమ్ముకునేందుకు ఈ కియోస్క్ ఉపయోగపడుతుంది.


కియోస్క్ ద్వారా జరిగిన లావాదేవీల వివరాలు


ఎంటల కొనుగోలు వివరాలు తెలుపుతున్న దృశ్యం

అందుబాటులో ప్రయోగశాలల సమాచారం

రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు డాక్టర్ వైఎస్సార్ సమీకృత వ్యవసాయ ప్రయోగశాలల సమాచారం అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ఏ భూమిలో ఏ పంటను సాగు చేయాలి, దానికి సంబంధించిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, పశువులకు వచ్చే రోగాలకు సంబంధించి అన్ని ప్రయోగాలు కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకోవచ్చు.

దళారుల చేతిలో మోసపోయే పరిస్థితులు లేవు

గతంలో రైతులు పండించిన పంటకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలియక రైతులు ఇబ్బందులు పడి దళారుల చేతిలో మోసపోయే పరిస్థితులు ఉండేవి. కానీ ఆ పరిస్థితి లేకుండా కియోస్క్ ద్వారా దగ్గరలోని కొనుగోలు కేంద్రాల సమాచారం లభిస్తుంది. రైతులకు లాభదాయకంగా కియోస్క్ ఉంది.

వాతావరణ సమాచారం

ఈ యంత్రం ద్వారా వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంది. రైతు భరోసా కేంద్రాల పరిధిలో కనిష్ఠ, గరిష్ఠ, ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేస్తుంది. దానికి అనుగుణంగా రైతులు ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చో సులభంగా తెలుసుకోవచ్చు.

ఎరువులు, పురుగు మందులు పొందవచ్చు

రైతులకు సంబంధించిన వ్యవసాయ సమాచారాన్ని కియోస్క్ ద్వారా తెలుసుకోవచ్చును. వైఎస్సార్ రైతు భరోసా, సాగుకు భరోసా, ప్రకృతి వ్యవసాయం సాగు చేసే విధానం, మూగ జీవాలకు అంబులెన్స్, పంటల కొనుగోలు వంటి సమాచారం కియోస్క్ ద్వారా తెలుస్తుంది. ఎరువులు, పురుగు మందులు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సమాచారం అందిస్తే కియోస్క్ ద్వారా నివేదికను పంపించి ఎరువులు, పురుగు మందులు దిగుమతి చేస్తారు. ఎరువులు, పురుగు మందుల క్రయ విక్రయాలను ఎప్పటికప్పుడు కియోస్క్‌లో నమోదు చేస్తారు. ఈ కియోస్క్ ద్వారా రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సమాచారం తెలుసుకుని బుక్ చేసుకోవచ్చు.

గ్రామ స్థాయిలోనే అన్ని రకాల సేవలు



రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. దీని ద్వారా తొమ్మిది రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థిక ప్రగతి సాధించవచ్చును. గ్రామ స్థాయిలో అన్ని రకాల సేవలు లభించటంతో రైతులు సంతోషంగా ఉంటున్నారు.

దొండేటి పాపకుమారి, ఏవో, దాచేపల్లి

న్యాయవాదులపై తప్పుడు కేసులను రద్దు చేయాలి

గురజాల : గుంటూరులోని న్యాయవాది బి.నాగరాజుపై పోలీసులు పెట్టిన తప్పుడు కేసును రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు భవనాలలో సోమవారం బి.నాగరాజుపై, మంగళగిరిలో జి.గవాస్కర్‌లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారిపై పెట్టిన కేసులను వెంటనే రద్దు చేసి పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీ నాగార్జున, బండి వీరభద్రుడు, కర్రా చినకోటేశ్వరరావు, జక్కా చెన్నకేశవరావు, కలివెల ప్రభుదాసు, డీవీఆర్‌కే మూర్తి, కొంగర హరిసత్యనారాయణ, సురేష్, జానీబాషా తదితరులున్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మాచర్ల : పట్టణంలోని సివిల్ జూనియర్ కోర్టులో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు సి.హెచ్. నాగిరెడ్డిల ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించారు. గుంటూరు పట్టణానికి చెందిన నాగరాజు, మంగళగిరికి చెందిన న్యాయవాదులపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. కేసు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సి.శ్రీనివాసరావు, కె.డేవిడ్‌రాజు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పిడుగురాళ్లలో న్యాయవాదుల విధుల బహిష్కరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని సివిల్ కోర్టులో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కుమారస్వామి మాట్లాడుతూ గుంటూరులోని పట్టాభిపురంలో న్యాయవాది నాగరాజు, మంగళగిరిలో న్యాయవాది జి.గవస్కర్‌లపై పోలీసులు అక్రమ కేసులు రిజిస్టర్ చేయటంతో ఎవరైతే కేసులు బనాయించారో వారిపై చర్యలు తీసుకోవాలంటూ గుంటూరు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులను బహిష్కరించటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, దారా చెన్నయ్య, ఎ.రూత్ బెనియస్, ఉడతా కోటేశ్వరరావు, బత్తుల దాసు, వై.వెంకటేశ్వర్లు, వి.సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, జి.రమేష్, పి.నవ్య, ఎస్‌కే మౌలాలి, ఐ.పిచ్చయ్య, కె.సాగర్, ఎం.లోకేశ్వరి, ఎస్‌వీ కోటేశ్వరరావు, అయాజ్‌నాయక్, పి.మణి, ఎం.రాజశేఖర్, ప్రశాంత్‌నాయక్ తదితరులు ఉన్నారు.


విధులను బహిష్కరించిన న్యాయవాదులు

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.మురళీ గంగాధర్‌రావు

పిడుగురాళ్ల: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.మురళీ గంగాధర్‌రావు అన్నారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మురళీ గంగాధర్‌రావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, సమయాన్ని వృథా చేయకుండా భావి భారత పౌరులుగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి, సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, న్యాయవాదులు జి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, ఎం.జాకబ్, కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్, పారా లీగల్ వలంటీర్లు వి.నాగరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



జానపాడులో మొసలి కలకలం


జానపాడు గ్రామంలో నడిరోడ్డుపై కనిపించిన మొసలి

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలంలోని జానపాడు గ్రామంలో ఆదివారం రాత్రి ఓ మొసలి కలకలం రేపింది. హైస్కూల్ సమీపంలో సంచరిస్తున్న మొసలిని చూసి గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అధికారులు దానిని పట్టుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. మొసలి కనిపించిన ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల, గ్రామ సచివాలయం ఉందని, వెంటనే అధికారులు దానిని పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – పిడుగురాళ్ల

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

మాచవరం: ఆయిల్ పామ్ సాగు ఎంతో లాభదాయకమని ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో ఉద్యాన శాఖ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్, అవగాహనా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 8 మండలాల్లో ఆయిల్ పామ్ సాగుకు గుర్తించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా మండలంలోని పిల్లుట్ల గ్రామంలో సుమారు 6 ఎకరాల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయిల్ పామ్ మొక్కల ఖరీదుపై 100 శాతం రాయితీతో హెక్టారుకు 157 మొక్కలకు గాను దేశీయ మొక్కకు రూ.133, విదేశీ మొక్కకు రూ.193 చొప్పున రూ.29 వేల రాయితీ అందించడం జరుగుతుందని తెలిపారు. సాగు ప్రోత్సాహానికి హెక్టారుకు 50 శాతం రాయితీపై 4 సంవత్సరాలకు రూ.21 వేలు అందిస్తారని తెలిపారు. బిందు సేద్యం ద్వారా సాగుకు డ్రిప్ ఇరిగేషన్ పథకం అందించడం జరుగుతుందని తెలిపారు. వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ పల్నాడు జిల్లా ఏరియా మేనేజర్ నవీన్ మాట్లాడుతూ మాచవరం మండలంలో ఆయిల్ పామ్ సాగుకు 12 ఎకరాలను గుర్తించామని, కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి రైతులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. పంట వేసిన నాలుగో ఏడాది నుంచి దిగుబడి మొదలవుతుందని సుమారు 30 ఏళ్ల వరకు సాగు చేసుకోవచ్చని, ఏడాదికి రూ.లక్ష వరకు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటాయని, చీడపీడలు తక్కువగా ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, పిన్నెల్లి, శ్రీరుక్మిణీపురం, కొత్తగణేశునిపాడు, మాచవరం, కొత్తపాలెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్

తల్లి పాలు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల : తల్లిపాలు పిల్లలకు ఎంతో ఆరోగ్యకరమని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణ లెనిన్ నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలను సంరక్షించటంతోపాటు పోషక విలువలు కూడా అందుతాయని, తల్లి ఆరోగ్యంగా ఉంటే పుట్టిన బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీలు కూడా బాలింతలు, గర్భిణులకు పోషక విలువలపై అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. అనంతరం ప్రీ స్కూల్ కిట్లను రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రుక్సానా బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన మిర్చినారు అందించాలి


నర్సరీలో మిర్చి నారు పరిశీలించి సూచనలు చేస్తున్న హెచ్‌వో వై.మోహన్

రెంటచింతల: ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన విత్తనాలతో సస్యరక్షణ చర్యలు చేపట్టి నాణ్యమైన మిర్చి నారును మాత్రమే నర్సరీ నిర్వాహకులు రైతులకు అందించాలని గురజాల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. సోమవారం రెంటచింతలలోని పలు నర్సరీలను ఆయన సందర్శించి వాటి నిర్వాహకులకు మిర్చినారు పెంపకంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, సూచనలు చేసి మాట్లాడారు. సంప్రదాయ పద్ధతిలో నారు పెంచే సమయంలో అధిక వర్షాలు పడితే మొక్కలకు కోయినోఫోరా ఎండు తెగులు ఆశిస్తున్నట్లు గమనించిన వెంటనే దాని నివారణకు 10 లీటర్ల నీటికి కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మందులను కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. నారు వడబడి తలలు వాల్చినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేసుకోవాలని సూచించారు. వేరు కుళ్లు ఆశించిన నారుమళ్లలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లేదా కార్బండిజం 10 గ్రాములు 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. పాలి ట్రే, ప్రో ట్రేలలో నారు పెంచడం లేదా షేడ్ నెట్‌లలో పెంచే చోట అధిక వర్షాలు పడితే ప్రో ట్రేలలో ఉన్న మొక్కలపై వెంటనే కప్పేయాలని, నీరు నిలబడకుండా కాలువల ద్వారా పారించాలని సూచించారు. నారులో కుళ్లు తెగులు కనబడిన వెంటనే నీటి తడులను ఆపేయాలన్నారు. రైజోక్టోనియా వేరు కుళ్లు నివారణకు ట్రేలలో నింపే మిశ్రమంలో ట్రైకోడెర్మావిరిడీ కలపాలన్నారు. మ్యాంకోజెబ్, కార్బండిజం మిశ్రమాలలో లీటరు నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణం మబ్బు పట్టి వరుసగా వర్షాలు పడినప్పుడు బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఎక్కువగా కనబడుతుందన్నారు. ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోవడం జరుగుతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, ఒక గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అధికారుల సూచనలతో తెగుళ్లు సోకని నాణ్యమైన మిర్చి నారును రైతులకు అందించినప్పుడే వారికి అధిక దిగుబడులు వస్తాయన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి


రైతులు, అధికారులతో కలిసి పత్తి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి : ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కేసానుపల్లి శివారులోని లింగం వెంకటేశ్వర్లు సాగు చేస్తున్న పత్తి పంటను సోమవారం ఆయన వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రభుత్వం అందించే సబ్సిడీ ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని చెప్పారు. రైతులు పండిస్తున్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి అధిక దిగుబడులు సాధించేలా రైతులను సమాయత్తం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతులు పండించే పంటలకు కనీస గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పిస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. పత్తి పంటను ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో వ్యవసాయశాఖ పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవోలు డి.పాపకుమారి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


వాహనదారుల పత్రాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఆంజనేయులు

రెంటచింతల: ప్రభుత్వం నిర్దేశించిన ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని లేనిచో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎం.ఆంజనేయులు అన్నారు. సోమవారం రెంటచింతలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలను పాటించని 10 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసి రూ.1,350 అపరాధ రుసుం వసూలు చేయడం జరిగిందన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ చేసే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సమయంలో హెల్మెట్ ధరించి ఉండాలని, కారు డ్రైవింగ్ చేసే సమయంలో సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోవాలాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. 18 సంవత్సరాల లోపు మైనర్లు (పిల్లలు) వాహనాలు నడిపినట్లయితే వారి తల్లిదండ్రులపై, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహారం


విద్యార్థినికి పౌష్టికాహారం అందిస్తున్న కమిషనర్ వెంకటదాస్

మాచర్ల : విద్య ద్వారానే సమాజంలో పేద పిల్లల అభివృద్ధికి బాట పడుతుందని మాచర్ల మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ అన్నారు. కార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పీడబ్ల్యూ కాలనీలో బాలబాట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ అమర్‌నాథ్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి విద్యనభ్యసించి ఉన్నతంగా ఎదగాలన్నారు. 25 మంది విద్యార్థులకు రెండు నెలలకు సరిపడా పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దళిత సేవాదళ్ అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, కార్యదర్శి వై.చంద్రారావు, బాలబాట ఏసీవో పి.ప్రసాద్, వినుకొండ రాంబాబు పాల్గొన్నారు.

రత్నం మాస్టర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి

పిడుగురాళ్ల: ఎస్టీయూ అభివృద్ధికి నిరంతరం పాటుపడిన వ్యక్తి రత్నం మాస్టర్ అని ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్టీయూ భవనంలో దొప్పలపూడి రత్నం సంస్మరణ సభను ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే పరిమితం కాకుండా ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి అని కొనాయాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏపీఎస్టీఎఫ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్న సామెత రత్నం మాస్టర్‌కు సరిగ్గా సరిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా శాఖ అధ్యక్షులు ఎల్‌వీ రామిరెడ్డి, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, ఏపీఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్, సుధీర్‌బాబు, ఎస్టీయూ అధ్యక్షులు ఆర్.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.గంగాధర్‌రావు, ఎం.వెంకట కోటయ్య, బి.సంపత్‌బాబు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి శ్రావణమాస పూజలు



దాచేపల్లి : స్థానిక వీర్ల అంకమ్మతల్లి గోపయ్య స్వామి దేవాలయంలో మంగళవారం నుంచి శ్రావణమాస పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. నెల రోజుల పాటు ఆలయంలో చండీయాగం, లక్ష గాజుల పూజలు, లక్ష్మీగౌరీ పూజలు, చండీయాగ ప్రదక్షిణ తదితర పూజ కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతి మంగళవారం, శుక్రవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని చెప్పారు. నెలరోజుల పాటు జరిగే శ్రావణమాస పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు యలమల నరేష్ కోరారు.

కేసీపీ విశ్రాంత ఉద్యోగి మృతి

మాచర్ల: కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగి పాటిబండ్ల రామోహన్‌రావు (92) అనారోగ్యంతో మృతి చెందారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు రామోహన్‌రావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

కారెంపూడి: కారెంపూడి మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడిందని ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేశామని కానీ సమావేశం నిర్వహించడానికి అవసరమైన కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి సమావేశ తేదీని తర్వాత ప్రకటిస్తామన్నారు. ఎలాంటి సమావేశం హడావుడి అక్కడ కన్పించలేదు. 15 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలే తప్ప టీడీపీ సభ్యులు ఒక్కరు కూడా లేరు. సమావేశానికి కోరంకు సరిపడా సభ్యులు కూడా సంతకాలు చేయకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో వెల్లడించారు.

నాటు సారా బట్టీ ధ్వంసం.. ఇద్దరి అరెస్టు



కారెంపూడి: కారెంపూడికి దక్షిణంలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో నాటు సారా బట్టీని కారెంపూడి పోలీసులు, పిడుగురాళ్ల ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా సోమవారం దాడి చేసి ధ్వంసం చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ కె.అమీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కారెంపూడి గ్రామానికి చెందిన వల్లెపు కొండయ్య, బాణావతు రామాంజీనాయక్‌లను అరెస్టు చేయడం జరిగిందని పేర్కొన్నారు. నాటు సారా బట్టీని ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి పులియబెట్టిన 200 లీటర్ల బెల్లం ఊటను కూడా ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. స్టేషన్ హెచ్‌సీ ఉమామహేశ్వరరావు, ఎక్సైజ్ సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

వైహెచ్‌కేకి సినారే సాహిత్య పురస్కారం



పిడుగురాళ్ల: పట్టణానికి చెందిన ప్రముఖ కవి వైహెచ్‌కే మోహన్‌రావు సినారే సాహిత్య పురస్కారానికి ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా కమ్మగూడ తుర్కయంజాల్‌లోని మహాకవి సినారే కళాపీఠం నుంచి సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు. ఈ అవార్డును ఆగస్టు 10వ తేదీ మహాకవి సినారే కళాపీఠం వద్ద అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎంఆర్‌పీ లేకుండా విక్రయిస్తే సహించేది లేదు



పిడుగురాళ్ల: ఎంఆర్‌పీ లేకుండా ఏ వస్తువును విక్రయించినా సహించేది లేదని సత్తెనపల్లి డివిజన్ తూనికలు కొలతల అధికారి జాన్ సైదా అన్నారు. పట్టణంలోని పలు షాపుల్లో సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని సెల్ షాపుల్లో వస్తువులపై కనీసం ఎంఆర్‌పీ లేకుండా విక్రయిస్తున్నారని తెలుసుకొని తనిఖీ చేయటం జరిగిందన్నారు. ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూళ్లు చేస్తే సహించమని తెలిపారు. పలు తినుబండారాల షాపులు కూడా పరిశీలించటం జరిగిందన్నారు. పట్టణంలో వంశీ మెడికల్స్ పక్కన ఉన్న రాజేశ్వరీ సెల్ షాపులో తనిఖీ చేయగా ఎంఆర్‌పీ లేని కారణంగా వస్తువులను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. యజమానిపై కూడా కేసులు నమోదు చేయటం జరుగుతుందని అన్నారు. గుట్కా, ఖైనీ వంటివి విక్రయిస్తే సహించేది లేదని, కొన్ని ప్రభుత్వ అనుమతి లేని సిగరెట్లను అమ్మకాలు చేస్తున్నారని తెలిసిందని, నిఘా ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు.